

తరగతుల విలీనంపై ఆందోళన

మంత్రాలయం రామచంద్రనగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో 3 నుంచి 5 తరగతులను పాతూరులోని పాఠశాలకు మార్చారు. విద్యార్థుల తల్లులు ఆందోళన నిర్వహించారు. 10లో▸



బైక్‌ల దొంగ దొరికాడు

మద్యం, జల్సాలకు అలవాటు పడి సులువుగా డబ్బు సంపాదించే మార్గంగా బైక్‌ల చోరీని ఎంచుకున్నాడు. పోలీసులు నిఘా వేసి దొంగను పట్టుకుని కటకటాలకు పంపారు. 10లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,606.28
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 30.692
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 14,800
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 160

న్యూస్‌రీల్

నల్లమలలో వజ్రాల వేట



నల్లమల అడవిలోని వక్కిలేరు వాగు వెంట వజ్రాల కోసం అన్వేషిస్తున్న ప్రజలు

శిరివెళ్ల: తొలకరి పలకరించడంతో ప్రజలు పొలం బాట పట్టకుండా వజ్రాల వేట కోసం నల్లమల అడవికి వెళ్తున్నారు. నంద్యాల–గిద్దలూరు రహదారి మధ్య గాజులపల్లె సమీప ప్రాంతంలో సర్వ నారసింహస్వామి క్షేత్రం ఉంది. ఇక్కడ ప్రతి ఏటా తొలకరి చినుకుల అనంతరం వజ్రాల వేట సాగుతుంది. ఈ ఏడాది కూడా చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు ఇక్కడికి వచ్చారు. సర్వ నారసింహస్వామి ఆలయ సమీపంలోని వక్కిలేరు వాగు వెంట గుంతలు తీసి వజ్రాల కోసం అన్వేషణ చేస్తున్నారు. ఎక్కువగా చెకుముకి రాయి తరహాలో తెల్లగా ఉండే చిన్న చిన్న రాళ్లు దొరుకుతున్నాయని ప్రజలు చెబుతున్నారు. స్థానికులే కాకుండా ప్రకాశం జిల్లా వాసులు ఇక్కడికి వస్తున్నారు. రోజంతా వెదికి రాత్రికి తెలుగు గంగ కాల్వ వద్ద ఉన్న ఆంజనేయస్వామి గుడి వద్ద నిద్రిస్తున్నారు.

రైతులు చెల్లించిన రుణాలు స్వాహా

- నాగంపల్లి సొసైటీ సీఈఓ సస్పెన్షన్!

కొత్తపల్లి: రైతులు చెల్లించిన రుణాలు రూ.40 లక్షల వరకు స్వాహా చేసినట్లు నాగంపల్లి సొసైటీలో పనిచేస్తున్న సీఈఓ కుమ్మరి కోటేశ్వరయ్యపై ఆరోపణలు వచ్చాయి. వసూలు చేసిన రుణాల మొత్తానికి మాన్యువల్‌గా రశీదులు ఇచ్చి ఆన్‌లైన్ పేమెంట్‌లో మాత్రం కొంత డబ్బు చెల్లించి తనచేతివాటం చూపించినట్లు తెలుస్తోంది. దీనికి తోడు మార్చినెల నుంచి అతను విధులకు హాజరు కావడం లేదు. అధికారులు ఫోన్లు చేస్తే స్పందించడం లేదు. దీంతో ఆత్మకూరు పట్టణంలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ మహమ్మద్ రసూల్.. ఈనెల 10న ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. జిల్లా అధికారులు ఈనెల 11న విచారణ చేయగా ఆ విషయం బుధవారం వెలుగులోకి వచ్చింది. విచారణ జరుగుతుండగానే సీఈఓ కోటేశ్వరయ్య నుంచి అధికారులు రూ.10 లక్షలు రికవరీ చేసినట్లు తెలుస్తోంది. అతనిపై కొత్తపల్లి, ఆత్మకూరు పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై మేనేజర్ మహమ్మద్ రసూల్ మాట్లాడుతూ.. నాగంపల్లి సొసైటీ సీఈఓ కొటేశ్వరయ్యపై విచారణ జరుగుతోందన్నారు. అతనని 12న విధుల నుంచి సస్పెండ్ చేశామని, పూర్తి వివరాలను విచారణ అనంతరం వెల్లడిస్తామని చెప్పారు.

సచివాలయ ఉద్యోగుల బదిలీలకు కసరత్తు

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ ఈ నెల 9తో పూర్తయిన నేపథ్యంలో ప్రస్తుతం గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలకు కసరత్తు ప్రారంభమైంది. ఈ నెల 30లోగా ఈ పక్రియను పూర్తి చేసేందుకు ఆయా శాఖల అధికారులు, ఎంపీడీఓలు కార్యాచరణను రూపొందిస్తున్నారు. కాగా కర్నూలు జిల్లాలో 672 గ్రామ/వార్డు సచివాలయాల్లో 4,256 మంది, నంద్యాల జిల్లాలో 516 గ్రామ/వార్డు సచివాలయాల్లో 3,810 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. గత ఏడాది జరిగిన బదిలీల్లో ఆయా కేటగిరీలకు చెందిన మెజారిటీ ఉద్యోగులు బదిలీ అయ్యారు. అయితే ప్రస్తుతం ఒకే ప్రాంతంలో ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారికి బదిలీలు చేపట్టాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అందిన సమాచారం మేరకు గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శులు 194, గ్రేడ్–6 కార్యదర్శులు(డిజిటల్ అసిస్టెంట్లు) 371 మంది ఉన్నారు. వీరిలో గ్రేడ్ –5 కార్యదర్శులు 153 మంది, గ్రేడ్ –6 కార్యదర్శులు 102 మంది గత ఏడాది బదిలీ అయ్యారు. ఐదేళ్లు ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న వారిలో గ్రేడ్–5 కార్యదర్శులు 27 మంది, గ్రేడ్–6 కార్యదర్శులు 206 మంది ఉన్నారు. రేషనలైజేషన్‌లో భాగంగా మండలాల పరిధిలోని సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు, ఖాళీల వివరాలను సంబంధిత ఎంపీడీఓలు హెచ్‌ఆర్‌ఎంఎస్ లాగిన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే బదిలీలకు అర్హత ఉన్న వారు ఈ నెల 22వ తేదీ నుంచి దరఖాస్తు చేసుకోనున్నారు.

కేజీబీవీల్లో బదిలీలకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు సిటీ: కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాల్లో (కేజీబీవీల్లో) పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులు రిక్వెస్ట్, మ్యుచువల్ బదిలీలకు దరఖాస్తు చేసుకోవచ్చునని డీఈఓ, సమగ్ర శిక్ష అదనపు కో–ఆర్డినేటర్ ఎస్.శామ్యూల్ పాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

సర్వేంద్రియానాం నయనం ప్రధానం అన్నారు పెద్దలు. ఇంతటి ప్రాధన్యం ఉన్న నేత్రాలకు సంబంధించి ఉచిత వైద్యం అందడం లేదు. ప్రభుత్వ వైద్యశాలల్లో అన్ని రకాల వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నా అక్కడికి వెళ్లిన రోగులకు నిరాశే మిగులుతోంది. పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన ప్రజలతోపాటు వృద్ధులకు, విద్యార్థులకు ఉచిత వైద్యం అందిస్తున్న ఈ – ఐ కేంద్రాలను నిర్ధాక్షిణ్యంగా మూసేశారు. అందులో పనిచేసే సిబ్బందిని రోడ్డున పద్దారు.

ఉచిత వైద్యంపై చిన్నచూపు



గత ప్రభుత్వ హయాంలో కంటి పరీక్షలు చేస్తున్న సిబ్బంది (ఫైల్)

- ఈ–ఐ కేంద్రాలకు 'చంద్ర' గ్రహణం
- పేదలకు ఉచిత కంటి పరీక్షలు, కళ్లాద్దాల పంపిణీకి మంగళం
- కంటి వెలుగు, ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను చాపచుట్టిన కూటమి ప్రభుత్వం
- అప్తాల్మిక్ అసిస్టెంట్లు, డేటా ఆపరేటర్లకు ఉద్వాసన
- అవస్థలు పడుతున్న దృష్టిలోపం ఉన్న బాధితులు
- సమస్య వస్తే ప్రైవేటు వైద్యమే



దొరిపాడు మండలం క్రిష్టిపాడుకు చెందిన దస్తగిరమ్మ అనే వృద్ధురాలు కళ్లు మసకబారటంతో కోవెలకుంట్ల ప్రభుత్వ వైద్యశాలలోని సీఎం ఈ – ఐ కేంద్రానికి వెళ్లమని గ్రామస్తులు చెప్పారు. ఆమె వైద్యశాలకు చేరుకోగా అక్కడ ఈ–ఐ కేంద్రం మూతవేసి ఉండటంతో పక్కనున్న జనరల్ డాక్టర్ దగ్గరకు వెళ్లి సమస్య చెప్పారు. నంద్యాల వైద్యశాలకు వెళ్లమని సిఫారసు చేశారు. ఇంటికి వచ్చి విచారించగా ప్రైవేటు వైద్యశాలకు వెళితే కనీసం రూ. 10 వేలకు పైగానే ఖర్చు అవుతుందని చెప్పడంతో అంత స్తోమత లేక ఇంటి దగ్గరే మసమసక చూపుతో నెట్టుకొస్తున్నాని ఆవేదన చెందుతోంది.



చాగలమర్రికి చెందిన సుబ్బమ్మ కూలి పనికి వెళ్లగా ప్రమాదవశాత్తు కంటికి గాయమైంది. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు బాధితురాలిని ఆళ్లగడ్డ ఈ–ఐ కేంద్రానికి తీసుకువచ్చారు. ఇక్కడ వైద్య సేవలు నిలిచి పోయాయని ప్రైవేటు ఆసుపత్రికి పోవాలని అక్కడున్న వారు సూచించారు. ప్రైవేటు ఆసుపత్రికి వెళ్తే వైద్య పరీక్షలు నిర్వహించి కొన్ని మందులు ఇచ్చి రూ. 1,600 తీసుకున్నారు. దీంతో పాటు కంటి అద్దాలు రాసి ఇవ్వగా రూ. 1,500 అయ్యింది. మొత్తం రూ. 3 వేలకు పైగా అయిందని మళ్లీ వారానికి ఒక రోజు వచ్చి చూపించుకుని వెళ్లాలని సూచించారు.

ఈ రెండు ఉదాహరణలు మాత్రమే.. కంటి సమస్యలకు సంబంధించి సీఎం ఈ- ఐ కేంద్రాలకు జిల్లా వ్యాప్తంగా రోజూ వెళ్తున్న వేలాది మందికి ఇదే పరిస్థితి ఎదురవుతోంది.

ఆళ్లగడ్డ: కంటి సమస్యలతో బాధపడే పేద, మధ్యతరగతి వర్గాలకు ఉచితంగా వైద్యసేవలు అందించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని అమలు చేసింది. ఆధునిక యంత్రాలతో ఉచితంగా నేత్ర పరీక్షలు చేసి, అవసరమైన వారికి కళ్ల జోడు సైతం అందజేసింది. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 'వైఎస్సార్ కంటి వెలుగు'ను ఆపేశారు. సీహెచ్‌సీల్లోని ఈ–ఐ కేంద్రాల కాంట్రాక్ట్ గడువు ముగిసి 10 నెలలుగా సేవలు నిలిచి పోయినా పట్టించుకోవడం లేదు. జిల్లా వ్యాప్తంగా 10 ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ – ఐ కేంద్రాలను మూసేశారు. దీంతో పేదలు కంటి పరీక్షల కోసం ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది.

గత ప్రభుత్వంలో పెద్దపీట

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదల వైద్యానికి అధిక ప్రాధాన్యమిచ్చారు. సీహెచ్‌సీల్లో ముఖ్యమంత్రి ఈ–ఐ కేంద్రాల నిర్వహణతో పాటు వృద్ధులు, వికలాంగులు, విద్యార్థుల కోసం గ్రామాల్లో, పాఠశాలల్లో వైఎస్సార్ కంటి వెలుగు వైద్య శిబిరాలను నిర్వహించారు. సేవలకు ఆటంకం కలుగకుండా కాంట్రాక్ట్ సంస్థతో ఎప్పటికప్పుడు ఎంఓయూ గడువు రెన్యువల్ చేస్తూ వచ్చారు. ఈ ఐ కేంద్రాలతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదు సంవత్సరాల్లో మొత్తంగా 3.60 లక్షల మందికి రిఫ్రాక్షన్ చెక్స్, ఫండస్ చెక్స్, డీఆర్, గ్లకోమా, మాక్యులర్ డిజనరేషన్, కాటరాక్ట్, హైపర్‌టెన్సివ్ రెటినోపతి తదితర కంటి పరీక్షలు నిర్వహించింది. ఆయా రోగాలకు సంబంధిత వైద్యసేవలు, అవసరమైన శస్త్ర చికిత్సలు నిర్వహించారు. సుమారు 1,80,118 మందికి కళ్లజోళ్లు అందజేశారు. ఒక్కో కేంద్రంలో రోజుకు సగటున 100 మందికి పైగా రోగులు చుట్టపక్కల గ్రామాల నుంచి వచ్చి కార్పొరేట్ కంటి వైద్యసేవలు ఉచితంగా పొందేవారు.



ఆళ్లగడ్డ సామాజిక ఆరోగ్య కేంద్రంలో తాళం వేసి మూసి వేసిన సీఎం ఈ - ఐ కేంద్రం

అత్యాధునిక పరికరాలు

ఈ–ఐ కేంద్రంలో అత్యాధునికమైన రూ. 8 లక్షల విలువ చేసే ఆటోరిఫ్లెక్షన్, రెటీన పరీక్షల యంత్రాలు, ఇతర పరికరాలతో కంటి రెటీన పరీక్షలు చేసేవారు. నివేదికలు అపోలో ఆసుపత్రి నిపుణులకు పంపించేవారు. వారి సూచనలు, సలహాలతో వైద్యం అందించేవారు. భవిష్యత్తులో వచ్చే సమస్యలను కూడా ముందుగానే గుర్తించడంతో పాటు నివారణ చర్యలను వైదయ నిపుణులు సూచించేవారు. 60 ఏళ్లలోపు వారందరికీ శుక్ల దృష్టి లోపం వంటి వివిధ కంటి వ్యాధులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసేవారు. షుగర్ వ్యాధిగ్రస్తులకు అత్యంత ఖరీదైన పండస్ రెటినో పరీక్షలు చేసి ఫలితాలను ఆయా ఈ–ఐ కేంద్రాల్లో తెలియజేసేవారు. ప్రస్తుతం ఈ సేవలకు మంగళం పాడారు. ముఖ్యమంత్రి ఈ–ఐ కేంద్రాలకు తాళాలు వేయడంతో వృద్ధులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆయోమయంలో సిబ్బంది

ఈ–ఐ కేంద్రాల్లో వైద్య సేవలు అందించేందుకు కేంద్రానికి ఇద్దరిని చొప్పున జిల్లాలోని 10 కేంద్రాల్లో 20 మంది ప్రైవేటు ఏజెన్సీ ద్వార నియమించారు. అయితే ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ఈ–ఐ కేంద్రాలను మూసి వేయడంతో కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న ఆప్తాల్మిక్ ఆఫీసర్, ఎక్విప్‌మెంట్ అసిస్టెంట్లు పరిస్థితి అయోమయంగా మారింది. 'ఇంతకు మనం విధుల్లో ఉన్నామా లేక తొలగించారా' అని వారికి వారే ఒకరినొకరు ప్రశ్నించుకుంటున్నారు.

ఇదీ దుస్థితి

కంటి సమస్యలతో బాధపడుతూ ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి వచ్చే వారికి ఆధార్ కార్డు ఆధారంగా ఓపీ రాసేవారు. అందులో ఒక ఐడీని క్రియేట్ చేసి ఉచితంగా కంటి పరీక్షలు చేసేవారు. పరీక్షల ఆధారంగా అవసరమైన మందులు ఉచితంగా అందించేవారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ సేవలను నిలిపివేసింది. దీంతో ఇదే పరీక్షలు ప్రైవేటు వైద్యశాల్లో అయితే రూ. 10 నుంచి రూ. 20 వేలు వరకు వసూలు చేస్తున్నారు. అదీ నంద్యాల, కర్నూలు, ప్రొద్దుటూరు తదితర పట్టణాల్లో ఉండే ప్రైవేటు కార్పొరేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడింది.

గతంలో ఇలా..

60 ఏళ్లలోపు వారికి రేషన్ కార్డు అవసరం లేకుండా కేవలం ఆధార్ కార్డు ఉంటే చాలు ఈ–ఐ కేంద్రాల్లో కంటి వైద్య పరీక్షలు చేసేవారు. దృష్టిలోపం ఉన్న వారికి ఖరీదైన ఫైబర్ కళ్ల అద్దాలు అందజేసేవారు. ఇందులో లబ్ధిదారుడు అతనికి ఇష్టమైన కలర్, సైజ్ ఎంచుకునే అవకాశం కూడా ఉండేది. ప్రభుత్వ సెలవు రోజుల్లో తప్ప అన్ని పనిదినాల్లో సేవలు కొనసాగించేవారు. పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు సైతం పరీక్షలు చేసి ఉచితంగా కళ్లద్దాలను అక్కడికే పంపించేవారు. ఆపరేషన్ అవసరమైన వారికి ఎన్‌జీవోల ఆధ్వర్యంలో ఉచితంగా నాణ్యమైన ఆపరేషన్లు చేయించేవారు. ఇవే కాకుండా మల్టీ విటమిన్ మాత్రలు, చుక్కల మందు (ఐ–డ్రాప్స్)లు ఉచితంగా అందించేవారు. ఈ సేవలన్నిటినికి కూటమి ప్రభుత్వం చాపచుట్టేసింది.

హామీల అమలులో 'కూటమి' విఫలం



చంద్రబాబు వెన్నుపోటు పుస్తకాలను ఆవిష్కరిస్తున్న జెడ్పీ ఛైర్మన్ పాపిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

- జెడ్పీ ఛైర్మన్ పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: సార్వత్రిక ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు లాయర్ మహేశ్వర రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, నాయకులతో కలిసి బుధవారం 'జగన్ అంటే నమ్మకం..చంద్రబాబు అంటే మోసం' అనే వెన్నుపోటు పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చాక ప్రజలకు మంచి సేవలు అందించాల్సింది పోయి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు పాల్పడటం, ఆస్తులను ధ్వంసం చేయడం పనిగా పెట్టుకున్నారన్నారు. ఏడాది పాలనలోనే ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై పూర్తిగా వ్యతిరేకత ఏర్పడిందన్నారు. గతంలో ఎన్నడూ చూడని పరిస్థితులు కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజలు చూస్తున్నారన్నారు. ప్రజలకు ఏదైనా చెప్పాడంటే చేస్తాడనే చేస్తాడనే నమ్మకాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలుపుకున్నారన్నారు. చంద్రబాబు మాత్రం చెప్పింది చేయడని మరోసారి రుజువు చేశారని పేర్కొన్నారు. శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయన్నారు. విద్య, వైద్యరంగాలతో పాటు వ్యవసాయం పూర్తిగా కష్టాల్లో కూరుకుపోయిందన్నారు. ఏడాది కూటమి పాలనను ప్రజలు చాలా స్పష్టంగా గమనించారన్నారు. నాయకులు పేరం సత్యనారాయణరెడ్డి,రామసుబ్బయ్య,కామిని గోపాల్‌రెడ్డి, కంబయ్య, గోపాల్‌రెడ్డి, సోమశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీజీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో జనవరిలో జరిగిన పీజీ మూడో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను విడుదల చేశారు. మొత్తం 264 మంది పరీక్షలకు హాజరు కాగా 248 మంది, అనుబంధ పీజీ కళాశాలల కోర్సులకు 147 మంది పరీక్ష రాయగా 134 మంది ఉత్తీర్ణత సాధించినట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు తెలిపారు. సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి 65 మందికి 39 మంది ఉత్తీర్ణులు అయ్యారన్నారు.

ఎల్‌ఎల్‌బీ పరీక్షలు ప్రారంభం

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో ఎల్‌ఎల్‌బీ 3, 5 సంవత్సరాల కోర్సుల సెమిస్టర్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉదయం సెషన్‌లో జరిగిన మూడు సంవత్సరాల లా ఆరో సెమిస్టర్ పరీక్షలకు 245 మందికి 243 మంది, మధ్యాహ్నం సెషన్‌లో జరిగిన ఐదు సంవత్సరాల లా 10వ సెమిస్టర్ పరీక్షలకు 31 మందికి 29 మంది హాజరైనట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. ఓల్డ్‌సిటీలోని ఉస్మానియా బీఈడీ కళాశాల పరీక్ష కేంద్రంలో జరుగుతున్న పరీక్షల్లో ఇద్దరు చూచిరాతలకు పాల్పడగా గుర్తించి డిబార్ చేసినట్లు పేర్కొన్నారు.

జూలై 5న జాతీయ లోక్ అదాలత్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ది

కర్నూలు(సెంట్రల్): అన్ని కోర్టుల్లో జూలై 5న జాతీయలోక్ అదాలత్ నిర్వహించాలని, అందులో ఎక్కువ కేసులు పరిష్కరించేలా ప్రత్యేక దృష్టిసారించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్/జిల్లా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జి.కబర్ది అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా న్యాయ సేవాసదన్‌లో జిల్లా న్యాయ సేవాధికారసంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్‌పై ఇన్సూరెన్స్, న్యాయవాదులు, పోలీసులు, బ్యాంకు, మునిసిపల్, భూసేకరణాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోర్టుల్లో పెండింగ్ ఉన్న రాజీ కాదగిన కంపౌండబుల్ క్రిమినల్, ఎక్సైజ్, రోడ్డు ప్రమాదాలు, సివిల్, భూసేకరణ కేసులను త్వరగా పరిష్కరించేందుకు జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ఎక్కువ కేసులను పరిష్కరించేలా ప్రత్యేక దృష్టి సారించి లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ అజయ్ కుమార్, కర్నూలు ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం డ్యాం నీటిమట్టం 845.10 అడుగులు

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం డ్యాం నీటిమట్టం బుధవారం సాయంత్రం సమయానికి 845.10 అడుగులకు చేరుకుంది. జలాశయంలో 70.3596 టిఎంసీల నీరు నిల్వ ఉంది. మంగళవారం నుంచి బుధవారం వరకు ఎగువ ప్రాజెక్టల నుంచి 33,876 క్యూసెక్కుల వరదనీరు జలాశయానికి వచ్చి చేరింది. జలాశయం నుంచి దిగువ నాగార్జునసాగర్‌కు విద్యుత్ ఉత్పత్తి అనంతరం 7,701 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యాక్‌వాటర్ నుంచి కల్వకుర్తి ఎత్తిపోతలకు 1,030 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కుడిగట్టు కేంద్రంలో 0.088 మిలియన్ యూనిట్లు, ఎడమగట్టు కేంద్రంలో 3.441 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు.



ఆసనాలు వేస్తున్న దృశ్యం

ప్రతి ఒక్కరి జీవితంలో యోగా భాగమవ్వాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం: యోగాతోనే ఆరోగ్యం సాధ్యమని శ్రీమఠం పీఠాధిపతి సుభుదేంద్రతీర్థులు అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం రాఘవేంద్రస్వామి మఠం ముంగిట మధ్వ కారిడార్‌లో యోగా చేపట్టారు. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ నేతృత్వంలో యోగాంధ్రను నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పీఠాధిపతి మాట్లాడుతూ యోగా ప్రతి మానవుడి జీవితంలో భాగం కావాలని కోరారు. యోగాతో ఆరోగ్య రీత్యా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ యోగా పట్ల ప్రతి ఒక్కరూ ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా భరత నాట్య ప్రదర్శన, యోగా ఆసనాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఈ ఏడాది 150 ఎకరాల్లో మల్బరీ సాగు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో ఈ ఏడాది 150 ఎకరాల్లో మల్బరీ సాగు చేపట్టి 1,053 మెట్రిక్ టన్నుల పట్టుగూళ్ల ఉత్పత్తికి చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా పట్టు పరిశ్రమ శాఖ అధికారి ఆంజనేయులు తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మల్బరీ ప్లాంటేషన్‌కు ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద ఎకరాకు రూ.85 వేల సబ్సిడీ లభిస్తుందన్నారు. షెడ్లకు యూనిట్ కాస్ట్ రూ.4.50 లక్షలు ఉండగా.. ఎస్సీ, ఎస్టీలకు రూ.4.05 లక్షలు, ఇతరులకు రూ.3,37,500 సబ్సిడీ లభిస్తుందని తెలిపారు. పరికరాలకు యూనిట్ కాస్ట్ రూ.75 వేలు ఉండగా.. ఎస్సీ, ఎస్టీలకు రూ.67500, ఇతరులకు రూ.56250 సబ్సిడీ వర్తిస్తుందన్నారు. జిల్లాలో నీటి వసతి కలిగిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'బియ్యం మాయం'పై సబ్ కలెక్టర్ సీరియస్

ఆదోని రూరల్: పట్టణంలోని ఓ ప్రయివేట్ గోదాములో ఈనెల 13న రాత్రి గుర్తించి పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలు మాయమవడంపై సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ సీరియస్ అయ్యారు. ఈ మేరకు బుధవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆయాశాఖల అధికారులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పట్టుబడిన బియ్యం మాయం చేసిన వారు ఎంతటివారైనా వదిలిపెట్టే ప్రసక్తేలేదని హెచ్చరించారు. ఇప్పటికే వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేశామన్నారు. గోదాము యజమానికి షోకాజ్ నోటీసు ఇస్తున్నట్లు చెప్పారు. నిందితులను గుర్తించేందుకు పోలీసు శాఖ దర్యాప్తు ముమ్మరం చేసిందన్నారు. ఆదోని డివిజన్ కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో బియ్యం ఎక్కువగా అక్రమ రవాణా జరుగుతోందని, సరిహద్దుల్లో పటిష్ట భద్రత చేపడతామన్నారు. డీలర్లు అక్రమాలకు పాల్పడితే లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు.

క్లుప్తంగా

జల వనరుల శాఖలో బదిలీలు

కర్నూలు సిటీ: జల వనరుల శాఖ పరిధిలోని ఆయా డివిజన్, సబ్ డివిజన్లలో పని చేస్తున్న ఇంజినీర్లు బదిలీ అయ్యారు. ఉమ్మడి జిల్లాకు కీలకమైన కేసీ(కర్నూలు, కడప) కాలువ పరిధిలో కర్నూలు సబ్ డివిజన్‌కు ఏడాదికి పైగా రెగ్యులర్ డీఈఈని నియమించ లేదు. ఏడాదిగా ఇన్‌చార్జి డీఈఈగా పనిచేస్తున్న ఎస్.ప్రసాదరావు సైతం బదిలీ అయ్యారు. ఈయన హంద్రీనీవా డివిజన్-3లో సబ్ డివిజన్1 డీఈఈగా పనిచేస్తూ కేసీ కెనాల్ కర్నూలు సబ్ డివిజన్ డీఈఈగా బాధ్యతలు నిర్వర్తించారు. ఈయన బదిలీ కావడంతో ఆ స్థానంలో ఎవరినీ నియమించ లేదు. వర్షాకాలం మొదలు కావడంతో కర్నూలు సబ్ డివిజన్ పరిధిలోని సుంకేసుల బ్యారేజీ నిర్వహణ బాధ్యతలు చూసేవారు ఎవరూ లేకుండా పోయారు. కీలకమైన ఈ సబ్ డివిజన్‌లో రెగ్యులర్ డీఈని నియమించకపోవడం గమనార్హం.

- ఇన్‌చార్జి డీఈగా పనిచేస్తున్న ఎస్.ప్రసాదరావును అనంతపురం హెచ్ఎల్‌సీ బత్తలపల్లికి బదిలీ చేశారు.
- మైనర్ ఇరిగేషన్ నంద్యాల సబ్ డివిజన్‌లో పనిచేస్తున్న డీఈఈ రవికుమార్‌ను కేసీ కెనాల్ నంద్యాల సబ్ డివిజన్‌కు బదిలీ చేశారు.
- శ్రీశైలం డ్యామ్ ఈస్ట్ సబ్ డివిజన్ సీఅండ్‌బీ డివిజన్1లో పనిచేస్తున్న డీఈఈ ఓ.శ్రీనివాసులును కడపకు, ఎల్ఎల్‌సీ ఆదోని సబ్ డివిజన్‌లో డీఈఈగా పనిచేస్తున్న జి.శైలేశ్వర్‌ను హిందూపూర్‌కు బదిలీ చేశారు.
- శ్రీశైలం ఈస్ట్ సబ్ డివిజన్2లో డీఈఈగా పనిచేస్తున్న వి.మధుసూదన్ రావును కడప సీఈ ఆఫీస్‌కు, తెలుగుగంగ సబ్ డివిజన్1 నంద్యాలలో డీఈఈగా పనిచేస్తున్న కె.వెంకటరామిరెడ్డిని ఎస్ఆర్‌బీసీ సబ్ డివిజన్4 (పాణ్యం) బదిలీ చేశారు.
- శ్రీశైలం వరద రక్షణ విభాగంలో డీఈఈగా పనిచేస్తున్న బి.రామకృష్ణ ఆర్‌డీఎస్‌కు, శ్రీశైలం డ్యామ్ ఈస్ట్ సబ్ డివిజన్4 నందు డీఈఈగా పనిచేస్తున్న అశోక్‌కుమార్ రెడ్డిని ఎస్ఆర్‌బీసీ సబ్ డివిజన్ 3 బనగానపల్లెకు, కర్నూలు సీఈ ఆఫీస్‌లో డీఈఈగా పనిచేస్తున్న ఎస్.శామ్యూల్ తెలుగుగంగ సబ్ డివిజన్-2 నంద్యాలకు బదిలీ చేశారు.
- అదే విధంగా గాజులదిన్నె ప్రాజెక్టులో డీఈగా పనిచేస్తున్న విజయ్‌కుమార్‌ను శ్రీశైలం ప్రాజెక్టు వరద రక్షణ విభాగానికి, ఎస్ఆర్‌బీసీ సబ్ డివిజన్2 (పాణ్యం) కె.కేశవరెడ్డి హంద్రీనీవా డివిజన్3 సబ్ డివిజన్1 డీఈఈగా బదిలీపై రానున్నారు.

బైక్‌ల దొంగ దొరికాడు

- జల్సాలకు అలవాటు పడి అడ్డదారి
- ద్విచక్ర వాహనాలు చోరీ చేస్తూ పట్టుబడిన దొంగ
- సీసీ ఫుటేజీ ద్వారా కేసును ఛేదించిన గోనెగండ్ల పోలీసులు
- 30 బైక్‌లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ విక్రాంత్ పాటిల్





దొంగ నుంచి రికవరీ చేసిన ద్విచక్ర వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు: మద్యం, జల్సాలకు అలవాటు పడ్డాడు. కూలీ పనుల వల్ల వచ్చే ఆదాయం సరిపోలేదు. దీంతో సులువుగా డబ్బు సంపాదించే మార్గంగా బైక్‌ల చోరీని ఎంచుకున్నాడు. బైక్‌లను అపహరించడం రూ. నాలుగైదు వేలకు అమ్మేయడం వచ్చిన సొమ్ముతో జల్సా చేస్తూ వచ్చాడు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు నిఘా వేసి దొంగను పట్టుకుని కటకటాలకు పంపారు. గోనెగండ్ల మండలం చిన్నమరివీడు గ్రామానికి చెందిన కురువ వెంకటేష్ సులువుగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకుని ఇళ్లముందు, బస్టాండ్లలో పార్క్ చేసి ఉంచిన ద్విచక్ర వాహనాలను అపహరించాడు. నకిలీ తాళాల సహాయంతో అపహరించి స్వగ్రామంలోని పాత ఇంట్లో దాచిపెట్టి కొన్నాళ్ల తర్వాత వాటిని విక్రయించి సొమ్ము చేసుకున్నాడు. కర్నూలు, ఎమ్మిగనూరు, గోనెగండ్ల ప్రాంతాల్లో వాహనదారుల నుంచి భారీగా ఫిర్యాదులు అందడంతో కేసు నమోదు చేసుకున్న గోనెగండ్ల పోలీసులు సీఐ విజయభాస్కర్ ఆధ్వర్యంలో సిబ్బంది బృందాలుగా ఏర్పడి సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా నిందితుడు కురువ వెంకటేష్‌గా గుర్తించారు. పెద్దమరివీడు గ్రామ రోడ్డులోని సుంకులమ్మ గుడి వద్ద ఉన్నట్లు గుర్తించి బుధవారం అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ.35 లక్షల విలువ చేసే 30 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని జిల్లా కేంద్రం కర్నూలుకు తీసుకువచ్చి ఎస్పీ ఎదుట హాజరుపరిచారు. ఈ సందర్భంగా ఆదోని డీఎస్పీ ఉపేంద్ర బాబు, గోనెగండ్ల సీఐ విజయభాస్కర్‌తో కలసి జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్ మీడియా సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. బస్టాండ్లు, ఇళ్ల ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలను టార్గెట్‌గా చేసుకుని కురువ వెంకటేష్ చోరీలకు పాల్పడ్డాడని ఎస్పీ తెలిపారు. కర్నూలు, ఎమ్మిగనూరు, గోనెగండ్ల, దేవనకొండ, కోడుమూరు, ఓర్వకల్లు ప్రాంతాల్లో ఇతను 30 ద్విచక్ర వాహనాలను దొంగలించినట్లు విచారణలో అంగీకరించాడన్నారు. బైక్ చాసీ నెంబర్ ద్వారా గుర్తించి వాటిని యజమానులకు అప్పగించనున్నట్లు తెలిపారు. మరో ఇద్దరు బైక్ దొంగలు ఉన్నట్లు దర్యాప్తులో తేలిందని, వారిని కూడా త్వరలో అరెస్టు చేస్తామన్నారు. చోరీ చేసిన బైకులను జొన్నగిరి ప్రాంతాల్లో పొలాల పనులు చేసుకునే రైతులకు ఒక్కొక్కటి రూ.4 వేల నుంచి రూ.5 వేలకు అమ్మేశాడని ఎస్పీ వెల్లడించారు. వాహన తనిఖీల్లో కూడా దొంగలించిన వాహనాలు బయటపడ్డాయని వెల్లడించారు.

సిబ్బందికి నగదు రివార్డులు...

ద్విచక్ర వాహనాలను రికవరీ చేయడంతో ప్రతిభను కనపరచిన పోలీసు సిబ్బందిని ఎస్పీ నగదు రివార్డులతో అభినందించారు. గోనెగండ్ల సీఐ విజయభాస్కర్‌తో పాటు హెడ్ కానిస్టేబుళ్లు తేజేశ్వర్ కుమార్, దేవరాజు, కానిస్టేబుళ్లు లక్ష్మీకాంత్, వై.రాజు, వీరేష్ గౌడు, బ్రహ్మయ్య, శ్రీనివాసులు, రమేష్ తదితరులను ఎస్పీ అభినందించి నగదు రివార్డులను అందజేశారు.

జిల్లాలో 5 వేల సీసీ కెమెరాలు ఏర్పాటు...

కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్), ఎంపీ నిధుల నుంచి జిల్లా వ్యాప్తంగా 5 వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు మున్సిపల్ పట్టణాల్లో కూడా సీఎస్ఆర్, ఎంపీ, మున్సిపల్ నిధులతో మరిన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాలను నిరోధించడమే కాక వాటిని ఛేదించేందుకు కూడా ఉపయోగపడతాయన్నారు. మూడున్నర నెలల వ్యవధిలోనే 5 వేల సీసీ కెమెరాలు ప్రజల సహకారంతోనే ఏర్పాటు చేశామన్నారు. సీసీ కెమెరాల సహాయంతోనే ద్విచక్ర వాహన దొంగను గుర్తించినట్లు ఎస్పీ వెల్లడించారు. వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూప్‌లలో ఏపీకే ఫైల్స్ వస్తే వాటిని క్లిక్ చేయకూడదని, ఓపెన్ చేయకూడదన్నారు. సైబర్ నేరాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడంలో మీడియా కూడా తన పాత్ర పోషించాలన్నారు.

నాటుసారా స్థావరంపై ఎక్సైజ్ దాడులు



సారా బట్టీని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

కర్నూలు: నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా కర్నూలు ఎక్సైజ్ పోలీసులు కల్లూరు మండలం కొల్లంపల్లి తండా శివారులోని నాటుసారా స్థావరంపై దాడులు నిర్వహించి బట్టీలను ధ్వంసం చేశారు. కర్నూలు ఎక్సైజ్ సీఐ చంద్రహాస్ తన సిబ్బంది చంద్రపాల్, రాజు, రామలింగయ్య, మధు, ఈరన్న తదితరులతో కలసి బుధవారం ఉదయం నాటుసారా స్థావరంపై దాడి చేసి సుమారు సారా తయారీకి ఉపయోగించే వెయ్యి లీటర్ల బెల్లం ఊటతో పాటు 30 లీటర్ల నాటుసారాను నేలపాలు చేశారు. అదే గ్రామానికి చెందిన లోకేష్ నాయక్, లక్ష్మణ్ నాయక్ తదితరులు సారా బట్టీలను నిర్వహిస్తున్నట్లు దర్యాప్తులో తేలిందని, వారిపై కేసు నమోదు చేసి త్వరలో అరెస్టు చేసి రిమాండ్‌కు పంపనున్నట్లు సీఐ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో అవగాహన సభ నిర్వహించారు. నాటుసారా తయారీ, రవాణా విక్రయాలు జరపడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. నాటుసారా తయారీ మానుకుని ప్రత్యామ్నాయ ఉపాధి ద్వారా జీవనం సాగించాలన్నారు. నాటుసారాను నిర్మూలించాలనే లక్ష్యంతో ప్రభుత్వం నవోదయం 2.0 కార్యక్రమాన్ని అమలు చేస్తుందని, ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

ఎక్కడి వారక్కడే !

- ఏడీఏల బదిలీల్లో కొలిక్కిరాని పైరవీలు...!
- బదిలీల్లో భారీగా తప్పిదాలు... ఒకే పోస్టులో ఇద్దరు, ముగ్గురి నియామకం

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ శాఖలో సహాయ సంచాలకుల (ఏడీఏ) బదిలీల్లో అనిశ్చితి కొనసాగుతోంది. ఈ నెల 10వ తేదీ ఉదయం వ్యవసాయ అధికారులతో పాటు, ఏడీఏల బదిలీల ఉత్తర్వులు వెలువడ్డాయి. వ్యవసాయ అధికారుల బదిలీల్లో గతంలో ఎప్పుడూ లేని విధంగా పైరవీలు జరగడంతో మార్పులు.. చేర్పులకు అంతే లేకుండా పోయింది. ఎట్టకేలకు వ్యవసాయ అధికారుల బదిలీల వ్యవహారం కొలిక్కి వచ్చినప్పటికీ.. ఏడీఏల బదిలీల వ్యవహారానికి ముగింపు లభించలేదు. ఏడీఏల బదిలీలను జోనల్ యూనిట్‌గా తీసుకొని చేపట్టారు. అయితే ఒక పోస్టులో ఇద్దరు, ముగ్గురిని నియమించడం, జోన్-4 చెందిన ఏడీఏను జోన్-3కి బదిలీ చేయడం వంటి తప్పిదాలు భారీగా జరిగాయి. ఉమ్మడి జిల్లాలో 13 మంది ఏడీఏలు బదిలీ అయ్యారు. వీటికి తోడు రాజకీయ సిఫారస్సులు, పైరవీలు కూడా ఊపందుకోవడంతో బదిలీ ఉత్తర్వులు వెలువడిన కొన్ని గంటల్లోనే వీటిని హోల్డ్‌లో పెట్టారు. తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు ఏడీఏలు ఎవ్వరూ రిలీవ్ కావద్దనే ఆదేశాలు వచ్చాయి. అయితే 10 రోజులు గడిచినా రివైజ్డ్ ఉత్తర్వులు ఇవ్వలేదు. దీంతో పాత స్థానాల్లో కొనసాగలేక, కొత్త స్థానాల్లో చేరలేక ఏడీఏల పరిస్థితి దయనీయంగా మారింది. పైరవీలు పెద్ద ఎత్తున జరుగుతుండటంతో ఏడీఏల బదిలీలపై అనిశ్చితి మరో రెండు, మూడు రోజులు కొనసాగే అవకాశం ఉంది. ఈ నెల 10వ తేదీ నుంచి బదిలీలపై బ్యాన్ వచ్చింది. ఏడీఏల బదిలీలకు సంబంధించి ఉత్తర్వులు వెలువడాలంటే ముఖ్యమంత్రి కార్యాలయం జోక్యం అవసరం ఉందనే చర్చ వ్యవసాయ శాఖలో కొనసాగుతోంది.

ఆదోని ఎమ్మెల్యేపై ఫిర్యాదు



మహిళా కానిస్టేబుల్‌కు ఫిర్యాదు పత్రం ఇస్తున్న దళితులు

ఆస్పరి: ఆదోని మండలం ఢణాపురం గ్రామానికి చెందిన దళిత సర్పంచ్ చంద్రశేఖర్‌ను అవమానించిన ఆదోని ఎమ్మెల్యే పార్థసారధి, టీడీపీ మహిళా నాయకురాలు గుడిసె క్రిష్ణమ్మ, మరికొందరు అగ్రవర్ణాల వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆస్పరి గ్రామానికి చెందిన మూలింటి చంద్రశేఖర్ ఆస్పరి పోలీసు స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు పత్రాన్ని మహిళా కానిస్టేబుల్ లావణ్యకు అందజేశారు. ఈ సందర్భంగా మూలింటి చంద్రశేఖర్ మాట్లాడతూ ఈనెల 17వ తేదీన ఢణాపురం గ్రామానికి ఆదోని ఎమ్మెల్యే పార్థసారధి, టీడీపీ నాయకురాలు గుడిసె క్రిష్ణమ్మ వెళ్లి గ్రామంలోని ఆంజనేయ స్వామి గుడి కట్టపై సమావేశం నిర్వహించారు. అయితే సర్పంచ్ చంద్రశేఖర్ దళితుడని తెలుసుకున్న ఎమ్మెల్యే కట్టపైకి పిలవకుండా అమానించారని అవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే సమక్షంలోనే దళిత ప్రజాప్రతినిధులకు అన్యాయం జరిగిందన్నారు. దళిత సర్పంచ్‌ను అమానించిన వారిపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆస్పరి, చిగిళి, తొగలుగల్లు, బిల్లేకల్లు, అట్టికల్లు, తంగరడోణ గ్రామాలకు చెందిన దళితులు పాల్గొన్నారు.

తరగతుల విలీనంపై తల్లుల ఆందోళన



జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లులు

మంత్రాలయం రూరల్: 'నిన్నటి వరకు మా పిల్లలు అక్కడే అక్షరాలు దిద్దారు. ఇప్పుడేమో ఆ పాఠశాలకు రావొద్దు అంటూ తిప్పి పంపుతున్నారు. దూరంగా ఉన్న పాఠశాలకు ఎలా పంపేది. కూలీ పనులకు చేసుకునే మేము పిల్లలను ఎలా చదివించుకోవాలి' అంటూ విద్యార్థుల తల్లులు ఆందోళనకు దిగారు. పాఠశాల విలీనాన్ని రద్దు చేయాలని స్థానిక రామచంద్ర నగర్‌లోని ప్రాథమిక పాఠశాల విద్యార్థుల తల్లులు బుధవారం నిరసన తెలిపారు. ఈ పాఠశాలలో 80 మంది వరకు చిన్నారులు విద్యనభ్యసిస్తున్నారు. టీచర్లను నియమించాల్సిన కూటమి ప్రభుత్వం చేతులెత్తేసింది. కేవలం ఒక్క టీచర్ మాత్రమే పాఠశాలకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ పాఠశాలలోని 3 నుంచి 5 తరగతులను పాతూరులోని పాఠశాలకు మార్చారు. రోజూ తల్లిదండ్రులు రామచంద్ర నగర్ పాఠశాలకు పిల్లలను పంపుతున్నారు. అయితే ఇక్కడకు వచ్చిన విద్యార్థులను ఆ పాఠశాలకు తరలించడంపై పిల్లల తల్లులు బుధవారం రోడ్డెక్కారు. పాతూరు పాఠశాలకు తమ పిల్లలను పంపమంటూ ఆందోళనకు దిగారు. తమ పిల్లలను దూరంలో ఉన్న పాతూరు పాఠశాలకు పంపాలంటే రోడ్ల రద్దీతోపాటు, వాహనాల బెడద ఎక్కువగా ఉంటుందని వారు వాపోయారు. తమ పిల్లలకు 5వ తరగతి వరకు ఇక్కడే చదువులు చెప్పాలని డిమాండ్ చేశారు. కాగా కూటమి నేతలు సైతం ఆందోళనలో దర్శనమివ్వడం విశేషం.

రేపటి నుంచి విజయీంద్రతీర్థుల ఆరాధనోత్సవాలు



పూజలందుకుంటున్న శ్రీరాఘవేంద్ర, శ్రీవిజయీంద్రతీర్థులమూలవిరాట్‌లు

హొళగుంద: స్థానిక ఆంజనేయ స్వామి ఆలయంలో ఈనెల 20వ తేదీ నుంచి 24వ తేదీ వరకు శ్రీ విజయీంద్ర తీర్థుల 411వ ఆరాధన మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా 20వ తేదీన గురువారం ధ్వజారోహణ, ప్రార్థనోత్సవం, గోపూజ, లక్ష్మపూజ, 21న పూర్వారాధన, 22న ఏకాదశి పూ జలు, 23న మధ్యారాధన, 24న ఉత్తరాధన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అదేరోజు శ్రీపురందరదాసర భజన మండలి, భక్తి భారతి కోలాటా ల మండలి బృందాలతో భజనలతో రథోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ సభ్యులు తెలిపారు.

శ్రీమఠం పీఠాధిపతికి ఆహ్వానం

విజయీంద్ర తీర్థుల 411వ ఆరాధన మహోత్సవాలకు మంత్రాలయంలోని శ్రీమఠం పీఠాధిపతి సుభుదేంద్రతీర్థులను బుధవారం ఆహ్వానించారు. ఉత్సవ నిర్వాహకులు, విజయీంద్ర తీర్థుల సేవా ట్రస్ట్ సభ్యులు పవనాచారి, రఘునాథాచారి, పాండురంగాచారి, మురళీధరాచారి, వెంకటేశాచారి, రాఘవేంద్రాచారి ఆహ్వాన పత్రికను అందించారు.

అప్పల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

బేతంచెర్ల: రుద్రవరం గ్రామానికి చెందిన కౌలు రైతు అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బోయ మీనిగ విక్రమ్ (40) అనే వ్యక్తికి సొంత పొలం లేదు. దీంతో 6.50 ఎకరాల కౌలుకు తీసుకొని సాగు చేశాడు. కాగా పొలం కౌలు, ఇంటి ఖర్చులు, సాగు కోసం చేసిన అప్పులు మొత్తం రూ. 11 లక్షలకు చేరింది. అయితే అప్పులు చెల్లించలేక జీవతంపై విరక్తితో మంగళవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు కిందికి దింపి చూడగా అప్పటికే మృతి చెందాడు. మృతుడి భార్య వెంకటరమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ వెంకటేశ్వర్లు శెట్టి బుధవారం తెలిపారు.

మద్యానికి బానిసై.. యువకుడి ఆత్మహత్య

ఓర్వకల్లు: సోమయాజులపల్లె వద్ద ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుంటూరు జిల్లా నరసరావు పేట పట్టణానికి చెందిన షేక్ ఖాశీం బాషా కొడుకు షేక్ నాగూరు బాషా(35) మద్యానికి బానిసకావడంతో మూడు నెలల క్రితం ఇంట్లో చెప్పకుండా బయటకు వచ్చేశాడు. సోమయాజులపల్లె వద్ద ఉన్న పెట్రోల్ బంక్ వద్ద తలదాచుకుంటూ చెత్త పేపర్లు, వాటర్ బాటిళ్లు సేకరిస్తూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో గత నెల 15వ తేదీన కుటుంబ సభ్యుల వద్దకు వెళ్లి డబ్బులు అడుగగా వారు ఇవ్వకుండా మందలించినట్లు తెలుస్తోంది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన నాగూరు బాషా తిరిగి సోమయాజులపల్లెకు చేరుకున్నాడు. ఈనెల 17వ తేదీన పెట్రోల్ బంక్ పరిసరాల్లో ఉన్న ఓ చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, స్థానికుల ద్వారా గుంటూరు జిల్లా వాసిగా తెలుసుకుని అక్కడి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు మృతుడి కుటుంబీకులను గుర్తించి విషయం తెలపడంతో సంఘటన స్థలానికి చేరుకున్నారు. బుధవారం శవపరీక్ష అనంతరం పోలీసులు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతునికి వివాహం కాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు తెలిపారు.

నంద్యాలలో యాచకుడి హత్య

బొమ్మలసత్రం: పట్టణంలోని స్థానిక నూనెపల్లె సమీపంలో దస్తగిరి (65) అనే యాచకుడిని గుర్తుతెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. త్రీ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రుద్రవరం మండలం కొండమాయినిపల్లి గ్రామానికి చెందిన దస్తగిరి కొంత కాలంగా కుటుంబానికి దూరంగా ఉంటూ పట్టణంలో భిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడు. బుధవారం వేకువజామున గుర్తుతెలియని దుండగులు దస్తగిరి తలపై బండరాయితో మోది హత్యకు పాల్పడ్డారు. స్థానికులు మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మ్యాన్‌హోల్‌లో పడి వృద్ధురాలి మృతి

బొమ్మలసత్రం: నంద్యాల ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో మంగళవారం రాత్రి గుర్తుతెలియని వృద్ధురాలు మ్యాన్‌హోల్‌లో పడి మృతిచెందింది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆర్టీసీ బస్టాండ్ వద్ద భిక్షాటన చేస్తూ జీవిస్తున్న ఓ వృద్ధురాలు రాత్రి మ్యాన్‌హోల్‌లో పడి ఊపిరాడక మృతిచెందింది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అప్పుడు మినరల్.. ఇప్పుడు జనరల్






కే.కొత్తూరులో బాటిళ్లలో తెచ్చుకున్న కుళాయి నీరు,చిన్నయ్యస్వామి చెంచుగూడెంలో తాగేందుకు బిందెలో సిద్ధంగా ఉంచిన కుళాయి నీరు

- విద్యార్థులకు అందని రక్షిత మంచి నీరు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు-నేడు పేరుతో పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో వసతులు కల్పించింది. నీటి సమస్య తలెత్తకుండా వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసింది. హెచ్ఎంల నిర్లక్ష్య కారణంగా కొన్ని పాఠశాలల్లో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు కాలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైనా వాటర్ ప్లాంట్ల ఏర్పాటుపై ఏమాత్రం పట్టించుకోలేదు. ఫలితంగా విద్యార్థులకు రక్షిత మంచి నీరు అందక కుళాయి నీరే తాగాల్సి వస్తోంది. కే.కొత్తూరు, చిన్నయ్యస్వామి చెంచుగూడెంలలో మంగళవారం మధ్యాహ్న భోజన సమయంలో ఆయా పాఠశాలల విద్యార్థులు ఇళ్ల వద్ద నుంచి కుళాయి నీరు తెచుకుని దాహం తీర్చుకున్నారు. చిన్నయ్య స్వామి చెంచుగూడెంలో నిర్వాహకులు ఓ బిందెలో నీరు ఉంచి రెండు గ్లాసులను ఏర్పాటు చేసి చేతులు దులిపేసుకున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం వాటర్ ప్లాంట్ల ద్వారా రక్షిత మంచి నీటిని సరఫరా చేసి విద్యార్థుల దాహం తీర్చాలని గ్రామస్తులు కోరారు. - రుద్రవరం

సికిల్‌సెల్‌తో చిక్కిశల్యం

- చిన్నారుల్లో అరుదైన రక్తవ్యాధి
- పలు రకాల అనారోగ్య ఇబ్బందులు
- పెన్షన్‌తో ఆదుకున్న గత ప్రభుత్వం
- నేడు జాతీయ సికిల్‌సెల్ వ్యాధి అవగాహన దినం



గుండ్రంగా ఉన్నవి ఎర్ర రక్త కణాలు, కొడవలి ఆకారంలో ఉన్నవి సికిల్‌సెల్ రక్త కణాలు

కర్నూలు(హాస్పిటల్): సాధారణంగా మనిషి రక్తంలోని ఎర్ర రక్త కణాలు గుండ్రటి ఆకారంలో ఉంటాయి. కానీ సికిల్‌సెల్ వ్యాధి వచ్చిన వారిలో మాత్రం ఇవి కొడవలి ఆకారంలో ఉంటాయి. ఇవి శరీరమంతా వ్యాపించి పలు అనారోగ్యాలకు దారి తీసేలా చేస్తుంటాయి. పుట్టుకతోనే సోకే ఈ వ్యాధి జీవితాంతం వారిని వేధిస్తుంది. ఆడుతూ పాడుతూ తిరగాల్సిన చిన్నారులు ఈ వ్యాధి కారణంగా ఏ పనీ చేతగాక నిస్సత్తువతో ఒకేచోట కుప్పకూలిపోతుంటారు. సమాజంలో అరుదైన ఈ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం జూన్ 19న జాతీయ సికిల్‌సెల్ వ్యాధి అవగాహన దినం నిర్వహిస్తున్నారు.

ఎర్ర రక్తకణాలు గుండ్రంగా ఉండి మనిషి శరీరమంతా ప్రయాణించి వివిధ అవయవాలకు ఆక్సిజన్‌ను సరఫరా చేస్తాయి. కాగా కొంత మందిలో ఈ కణాలు కొడవలి ఆకారంలోకి మార్పు చెంది ఉంటాయి. దీనినే సికిల్‌సెల్ వ్యాధిగా వైద్యులు పిలుస్తారు. ఈ వ్యాధి ఉన్న వారి రక్తకణంలోని ఒక జన్యువు సికిల్‌సెల్‌గా, మరొకటి మామూలుగా ఉంటే అలాంటి వారిని సికిల్‌సెల్ క్యారియర్లు ఉంటారు. వీరికి మామూలుగా ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉండవు. అయితే వివాహం చేసుకున్న దంపతులు ఇద్దరికీ ఇలాంటి లక్షణాలు ఉంటే వారికి జన్మించే పిల్లలకు రక్తకణంలోని రెండు జన్యువులూ వంపు తిరిగి ఉంటాయి. అలాంటి పిల్లలకు పుట్టుకతోనే ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. సాధారణ రక్తకణాల జీవిత కాలం 120 రోజులైతే సికిల్‌సెల్ రక్తకణాల జీవిత కాలం 20 నుంచి 25 రోజులు మాత్రమే. ఇవి నశించి పోయేంత వేగంగా కొత్త ఎర్ర రక్తకణాలు ఉత్పత్తి కాకపోవడంతో ఈ వ్యాధి ఉన్నవారు రక్తహీనతకు గురవుతారు. అంతేగాక సికిల్ రక్తకణాలు వంపు తిరిగి ఉండటం వల్ల సన్నటి రక్తనాళాల్లో సరిగ్గా ప్రవహించలేక శరీర భాగాలకు ఆక్సిజన్ అందడం తగ్గిపోతుంది. ఈ కారణంగా ఈ వ్యాధిగ్రస్తులు తగిన చికిత్స తీసుకోకపోతే 15 ఏళ్లలోపే మరణించే అవకాశం ఉంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ వ్యాధితో బాధపడుతున్న చిన్నారులు 40 మందికి పైగా ఉన్నారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో ఎక్కువగా ఇలాంటి వ్యాధిగ్రస్తులు ఉన్నారని వైద్యులు చెబుతున్నారు. ఇలాంటి అరుదైన వ్యాధి ఉన్న వారికి గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి నెలా రూ.10 వేల ప్రత్యేక పెన్షన్ ఇచ్చి ఆదుకున్నారు.

వ్యాధి లక్షణాలు

- దీర్ఘకాలం పాటు కామెర్లు ఉంటాయి
- రక్తహీనతతో శరీరం పాలిపోయి ఉండటం, కాళ్లు, చేతి వేళ్ల వాపుతో వంపు తిరిగి ఉండటం, ప్లీహం వాచిపోయి ఉండటం, నీరసం, తిమ్మిర్లు, డార్క్ ఐస్, చర్మం ముడతలు పడటం వంటి లక్షణాలు ఉంటాయి
- శిశువుకు ఆరు నెలల వయస్సు వచ్చే వరకు ఎలాంటి లక్షణాలు కనిపించవు. వయస్సు పెరిగే కొద్దీ లక్షణాలు కనిపిస్తాయి.
- ఆక్సిజన్ సరఫరా సరిగా లేకపోవడంతో శరీరంలో ఏదైనా ఒక భాగంలో తీవ్రమైన నొప్పి కలుగుతుంది.
- కౌమార దశలో ఉన్నవారు, పెద్దవారు దీర్ఘకాలిక నొప్పితో బాధపడుతూ ఉంటారు.

వ్యాధి నిర్ధారణ పరీక్ష

ఈ వ్యాధి నిర్ధారణకు ప్రాథమిక రక్త పరీక్ష ఖరీదు తక్కువలోనే ఉంటుంది. రక్త నమూనాను సోడియం మెటాబైసల్ఫేట్‌లో కలిపి మైక్రోస్కోప్ కింద చూస్తే రక్తకణాలు గుండ్రంగా ఉన్నాయా? వంపు తిరిగి ఉన్నాయా తెలుసుకోవచ్చు. తద్వారా ఆ వ్యక్తికి సికిల్‌సెల్ వ్యాధి ఉందో లేదో నిర్ధారిస్తారు. జన్యుపరమైన ఈ వ్యాధికి ఇప్పటివరకు మందు లేదు. సికిల్‌సెల్ క్యారియర్లుగా గుర్తించి, వారి మధ్య వివాహాలను నిరోధించడం ద్వారా ఈ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరగకుండా నియంత్రించవచ్చు.

గర్భిణులు జాగ్రత్తలు తీసుకోవాలి

తల్లిదండ్రుల్లో ఇద్దరికీ సికిల్‌సెల్ వ్యాధి ఉంటే వారికి పుట్టబోయే శిశువుకు సైతం ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉంటుంది. అందుకే గర్భం దాల్చక ముందే పుట్టబోయే శిశువుకు ఈ వ్యాధి రాకుండా తల్లికి ఫోలిక్ యాసిడ్ మాత్రలు ఇస్తాం. గర్భం దాల్చిన తర్వాత వస్తే బిడ్డకు వచ్చే అవకాశం ఉందా, లేదా అని తెలుసుకోవడానికి ఉమ్మనీరును పరీక్షకు పంపిస్తాం. ప్రసవం తర్వాత అయితే బిడ్డకు పరీక్షలు చేసి వ్యాధి నిర్ధారణ చేస్తాం. ఈ వ్యాధి ఉంటే అవసరమైన చికిత్స అందిస్తాం. గర్భిణీగా ఉన్నప్పుడు సికిల్‌సెల్ ఉంటే నెలలు నిండకు ముందే బిడ్డ జన్మించే అవకాశం ఉంది. దీనివల్ల శిశువు బరువు తక్కువగా ఉంటుంది. ఒక్కోసారి అబార్షన్ అయ్యే అవకాశం కూడా ఉంటుంది.

-డాక్టర్ టి.జ్యోత్స్న, గైనకాలజిస్టు, కర్నూలు